క్లుప్తంగా

నేడు నూజివీడులో జిల్లాస్థాయి 'జగనన్నకు చెబుదాం'

ఏలూరు(మెట్రో): జిల్లా స్థాయి జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం ఈ నెల 11న సోమవరం ఉదయం 10 గంటల నుంచి నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో కలెక్టరు, జిల్లా జాయింటు కలెక్టరు, జిల్లా స్థాయి అధికారులందరూ హాజరై అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. జిల్లాలోని అన్ని డివిజనల్ కార్యాలయాలు, మండల కార్యాలయాలు, మునిసిపల్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం యథావిధిగా నిర్వహిస్తామన్నారు.

ఉత్సాహంగా చెస్ పోటీలు

ఏలూరు రూరల్: చదరంగం సాధన వల్ల పిల్లల్లో చురుకుదనం, ఆలోచన, తెలివితేటలు పెరుగుతాయని చెస్ అసోసియేషన్ ఆఫ్ హేలాపురి అధ్యక్షుడు జి యోహాన్ అన్నారు. ఆదివారం ఏలూరు సత్రంపాడులో నగర స్థాయి చెస్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు చెస్ సాధనపై మక్కువ పెంచాలన్నారు. పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో బాలబాలికల తరలివచ్చారు. బాలుర విభాగంలో జి అభిషేక్ ప్రథమ స్థానం, జి అనురూప్ మోషి రెండోస్థానంలో నిలిచారు. బాలికల విభాగంలో ఎస్ లెబోనారాజ్ ప్రథమస్థానం, కె చొక్షిత ద్వితీయస్థానం చేజిక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో వి రత్నకిషోర్, వి శరణ్య, చెస్‌కోచ్ శ్యామల, కిరణ్మయి పాల్గొన్నారు. నిర్వాహకులు విజేతలకు సర్టిఫికెట్లు, షీల్డులు అందజేసారు.

అయ్యప్ప మాలధారులకు బిక్ష ఏర్పాటు

పెదవేగి : అయ్యప్ప మాల ధరించి, నిష్ఠతో పూజలు నిర్వహిస్తూ 40 రోజులపాటు దీక్ష చేసే భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేయడం ఎంతో పుణ్యకార్యమని పెదవేగికి చెందిన అయ్యప్ప భక్తుడు తొంటా తాతయ్యస్వామి అన్నారు. ఏపీ ఆయిల్ ఫెడ్ రైతు కమిటీ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, రాణి దంపతులు పెదవేగి సాయిబాబా ఆలయం దగ్గర నిర్వహించే అయ్యప్ప మాలధారులకు ఆదివారం నిర్వహించిన అన్నసమారాధనకు ఆర్థిక సాయం అందించారు. ఏర్పాట్లను పర్యవేక్షించిన తాతాయ్య మాట్లాడుతూ 14 ఏళ్లుగా పెదవేగి సాయిబాబా ఆలయం వద్ద అయ్యప్ప మాలధారులకు 40 రోజులపాటు భక్తులు, దాతల సహకారంతో ఏటా అన్న సమా రాధన నిర్వహిస్తున్నామని చెప్పారు. బెజవాడ నాగరాజు, సింహాద్రి మాణిక్యాలరావు, శ్రీనివాసరావు, బలరామకృష్ణ పాల్గొన్నారు.

మహిళపై దాడి

దెందులూరు: జాతీయ రహదారి సోమవరప్పాడు వద్ద ఆదివారం రాత్రి ఏలూరు రూరల్ మండలం వైఎస్సార్ కాలనీకి చెందిన మహిళను ఓ వ్యక్తి కారులో ఎక్కించుకుని ఆమెతో గొడవపడి, కొట్టి వాహనంలోంచి తోసివేశాడు. ఈ ఘటనలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ఏలూరు హైవే పోలీసులు ఆమెను చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారని దెందులూరు పోలీసులు తెలిపారు.

పేద విద్యార్థుల ఉన్నత విద్యకు బాట

- విద్య, వసతి దీవెన పథకాల్లో రూ.7.46 కోట్లు మంజూరు
- 15 గ్రామాల్లో 3,114 మంది విద్యార్థులకు లబ్ధి



కొల్లేరులో సమావేశమైన విద్య, వసతి దీవెన పథకాల అందుకుంటున్న విద్యార్థుల తల్లులు

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాలు పేదల ఉన్నత విద్యకు బాటలు వేసాయి. నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ రెండు పథకాల ద్వారా వేలాది మంది విద్యార్థులు ఉన్నత చదువు కొనసాగిస్తున్నారు. పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యార్థులతో పాటు బీకాం, బీఎస్సీ, బీఏ తదితర డిగ్రీలు చదువుకుంటున్న విద్యార్థులకు ఈ పథకాలు దన్నుగా నిలిచాయి. ఫలితంగా నగరాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో యువతీ, యువకులు సైతం ఉన్నత చదువులు కొనసాగిస్తున్నారు. హాస్టళ్లలో ఉంటూ ప్రైవేటు కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఈ పథకాలు ఎంతో మేలు చేస్తున్నాయని విద్యావేత్తలు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

యువతకు మేలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన 2019 నుంచి 2023 వరకూ ఈ రెండు పథకాల ద్వారా ఏలూరు రూరల్ మండలానికి చెందిన 15 గ్రామాల్లో 3,114 మంది లబ్ధి పొందారు. విద్యాదీవెన ద్వారా 1,839 మంది విద్యార్థులు రూ.5,43,63,948 అందుకున్నారు. వసతి దీవెనతో 1,275 మంది రూ.2,02,68,936 లబ్ధి పొందారు. మొత్తంగా రెండు పథకాల ద్వారా రూ.7,46, 32,884 ప్రభుత్వం లబ్ధిదారులకు ఖాతాల్లో జమ చేసింది. లబ్ధిదారుల్లో ఒక్కొక్కరూ ఏడాదికి రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకూ ఆర్థిక సహాయం పొందిన వారు ఉన్నారు.

గ్రామాల వారీగా విద్యా, వసతి దీవెన పథకాల లబ్ధిదారుల వివరాలు (రూపాయల్లో)

గ్రామం	విద్యాదీవెన (రూ)	వసతిదీవెన (రూ)	లబ్ధిదారులు
చాటపర్రు	1,11,16,580	4,0 65,321	622
పైడిచింతపాడు	24,40,716	7,63,005	160
ప్రత్తికోళ్లలంక	34,0,7703	13,37,067	242
కెడిపురం	10,40,346	4,22,079	69
కోమటిలంక	11,94,469	4,24,395	77
శ్రీపర్రు	54,40,720	18,53,995	318
పెదయాగనమిల్లి	5,47,636	,89,400	40
గుడివాకలంక	32,33,025	14,64,742	239
జాలిపూడి	88,61,385	37,0 3824	521
మల్కాపురం	72,18,770	25,54,660	335
మాదేపల్లి	98,62,310	34,90,448	491

పేదలకు ఉన్నత విద్య అందించారు



ముఖ్యమంత్రి జగన్ ప్రవేశపెట్టిన పథకాలు పేదలకు అండగా ఉంటున్నాయి. వసతి దీవెన, విద్యా దీవెన పథకాల ద్వారా నాలుగేళ్లలో మా గ్రామానికి రూ.7.37 లక్షలు మంజూరయ్యాయి. ఈ డబ్బు అందుకోవడం వల్ల గ్రామంలో యువతీ, యువకులు ఉన్నత విద్యావంతులు అవుతున్నారు. ఇలాంటి పథకాలు పేదలకు ఎంతో మేలు చేస్తాయి.

– బలే నాగరాజు, పెదయాగనమిల్లి

మా జీవితాల్లో మార్పు వచ్చింది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన వసతి దీవెన పథకం నా బిడ్డకు ఎంతో అండగా నిలిచింది. మా కుటుంబాన్ని ఆదుకుంది. ఏటా వస్తున్న రూ.పది వేలతో నా బిడ్డ చదువు సాఫీగా సాగిపోతోంది. పేదలు పెద్ద చదువులు చదువుకోవాలనే ఉద్దేశ్యంతోనే ముఖ్యమంత్రి జగనన్న ఈ పథకం అమలు చేస్తున్నారు. ఆయనకు నా ధన్యవాదాలు.

– యడ్ల లక్ష్మి, వెంకటాపురం

బ్రాహ్మణ సంక్షేమానికి పాలకులు కృషి చేయాలి



బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సత్యవాడ దుర్గా ప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో బ్రాహ్మణుల సంక్షేమానికి పాలకులు కృషి చేయాలని అఖిల భారత బ్రాహ్మణ సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు ఎంబీఎస్ శర్మ అన్నారు. స్థానిక మినీ బైపాస్ రోడ్డులోని హేలాపురి బ్రాహ్మణ సేవా సమాఖ్య భవనంలో ఆదివారం నిర్వహించిన హేలాపురి బ్రాహ్మణ సేవా సంఘం 40వ వార్షికోత్సవాలకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సంస్కృతిని తరతరాలుగా పోషిస్తున్న బ్రాహ్మణ జాతి విద్య, ఉపాధి, సాధికారికత సాధించడంలో 3 దశాబ్దాలుగా వెనకబడి ఉందని, బ్రాహ్మణుల్లో ఆర్థిక అభివృద్ధి కొరవడిన కారణంగా జాతీయ ఆర్థిక పేదరిక స్థాయి కంటే బ్రాహ్మణుల పేదరిక స్థాయి ఎక్కువగా ఉండడం ఆందోళన కలిగించే అంశమన్నారు. హేలాపురి బ్రాహ్మణ సేవా సంఘం 40వ వార్షికోత్సవం సందర్భంగా బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన 40 మందిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దిరిశాల వరప్రసాద్, తపన ఫౌండేషన్ చైర్మన్ గారపాటి సీతారామాంజనేయ చౌదరి, టీడీపీ కన్వీనర్ బడేటి చంటి, అంబికా గ్రూప్ సంస్థల ప్రతినిధి అంబికా రాజా, బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సత్యవాడ దుర్గా ప్రసాద్, హేలాపురి బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు ఎం. బానుమూర్తి, ద్రోణంరాజు వెంకట సుబ్బారావు, కేవీఎస్ శర్మ, తమ్మెర రామారావు, పాలంకి దుర్గా ప్రభాకరం, ఎంఎస్ శర్మ, సగరం బాల సుబ్రహ్మణ్యం, మద్దాలి భాస్కర శ్రీనివాస నాగరాజు, మొక్కపాటి శ్రీరామ చంద్రమూర్తి, తూములూరి విశ్వనాథశాస్త్రి పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన బ్రాహ్మణుల కార్తీక సమారాధన కార్యక్రమంలో నగరంలోని సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


సమాజ మార్పులో ఉపాధ్యాయుడి పాత్ర కీలకం



యూటీఎఫ్ 49వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో పాల్గొన్న రాష్ట్ర కౌన్సిలర్లు, ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సమాజ మార్పులో ఉపాధ్యాయుడు కీలకంగా మారాలని పీడీఎఫ్ పూర్వ ఫ్లోర్ లీడర్ వీ. బాలసుబ్రమణ్యం పిలుపునిచ్చారు. ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 49వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో భాగంగా రెండో రోజు ప్రతినిధుల సభ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చిన నూతన విద్యా విధానం శాస్త్రీయ విద్యను అందించే దిశగా మంచి బడికి పునాదులు వేయాలన్నారు. ప్రభుత్వ బడులను అభివృద్ధి చేసి కార్పొరేట్ విద్యా సంస్థలపై ప్రభుత్వ జోక్యం పెంచి వాటిని నియంత్రించాలని సూచించారు. రాష్ట్ర ప్రధాన కార్య దర్శి కేఎస్ఎస్ ప్రసాద్ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. కోశాధికారి బీ. గోపి మూర్తి ఆర్థిక నివేదికను, ఐక్య ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులు ఎం కుమార్ రాజా పత్రిక నివేదికను, ఆడిట్ కన్వీనర్ మల్లేశ్వర రావు ఆడిట్ నివేదికను, ప్రచురణ కమిటీ చైర్మన్ హనుమంతరావు ప్రచరణ నివేదికను, సహాధ్యక్షులు ఏ. కుసుమకుమారి మహిళా ఉద్యమ నివేదికలను ప్రవేశపెట్టారు. పలు తీర్మానాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సమావేశంలో 26 జిల్లాల నుంచి వచ్చిన యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు, ప్రతినిధులు పాల్గొన్నారు.

కోనపు రంగరాజును పరామర్శించిన కొడాలి నాని



కోనపు రంగరాజును పరామర్శిస్తున్న మాజీ మంత్రి కొడాలి నాని, కొఠారు అబ్బయ్య చౌదరి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగర ప్రముఖుడు కోనపు రంగరాజు కుమారుడు రాము ఇటీవల మృతి చెందగా రంగరాజును రాష్ట్ర మాజీ మంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని ఆదివారం ఆయన స్వగృహంలో కలిసి పరామర్శించారు. రంగరాజు కుమారుని కోల్పోవడం ఆ కుటుంబానికి తీరని లోటు అన్నారు. ఆయనకు ధైర్యం చెప్పి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కొడాలి నాని వెంట ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

విద్యార్థులకు భగవద్గీత కంఠస్థ పోటీలు



భగవద్గీత కంఠస్థ పోటీల్లో బహుమతులు సాధించిన విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తిరుమల, తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో భగవద్గీత మూడవ అధ్యాయంపై కంఠస్థ పోటీలు ఆదివారం స్థానిక రామచంద్రరావు పేటలోని శ్రీమత్ మార్కండేయ వేద పాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీల్లో జూనియర్స్ విభాగంలో మొదటి మూడు బహుమతులను నగరానికి చెందిన సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు నండూరి సరయు ప్రథమ బహుమతి , బీ. యోగిత ద్వితీయ బహుమతి, ఎం. శ్రీ తులసి సహస్ర తృతీయ బహుమతి గెలుపొందారు. సీనియర్స్ విభాగంలో ఏ.హేమ నాగ దత్త (నారాయణ పాఠశాల) ప్రథమ బహుమతి, పీఆర్ ఆదర్శ కుమార్ (సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్) ద్వితీయ బహుమతి, ఏ. వేద సరస్వతి తృతీయ బహుమతి గెలుపొందారు. న్యాయ నిర్ణేతలుగా ఎంవీఎస్ సత్యనారాయణ, లలితా కామేశ్వరి, డీ. పుష్ప భాను వ్యవహరించారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రాం అసిస్టెంట్ బీఎస్ఆర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	34
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.15	33
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	21
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	22
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	16
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	33
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	32
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	17
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –తిరుపతి	16.00	4830	22

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	32	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	54	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	58	చామదుంపలు	56
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	07–10
బెండకాయలు	50	కంద	72
పచ్చిమిర్చి	36	బీట్‌రూట్	50
కాకర కాయలు	40–48	కీరా దోస	36
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	78
బీరకాయలు (పందిరి)	64	అల్లం	120
క్యాబేజీ	20–25	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	58	పాలకూర	12
దొండకాయలు	44	చుక్కకూర	12
బంగాళదుంపలు	26	తోటకూర	12
ఉల్లిపాయలు	45–55	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	24–38	బఠాణీ	--
ఆనబకాయ (1)	20–25	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	28

మానవ హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలి



పాతబస్టాండ్ సెంటర్‌లోని మాట్లాడుతున్న డీబీఆర్‌సీ కోఆర్డినేటర్ జ్యోతి

ఏలూరు (టూటౌన్): ప్రతి ఒక్కరూ మానవ హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డీబీఆర్‌సీ) జిల్లా కో–ఆర్డినేటర్ ఎస్ జ్యోతి కోరారు. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆదివారం డీబీఆర్‌సీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1948లో ఐక్యరాజ్య సమితి డిసెంబరు 10న మానవ హక్కుల దినోత్సవం ఏర్పాటు చేసిందని గుర్తు చేసారు. మానవత ఏలూరు యూనిట్ అధ్యక్షుడు మేతర అజయ్‌బాబు మాట్లాడుతూ మానవ హక్కులను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కరుణోదయ మానసిక విభిన్న ప్రతిభావంతుల పాఠశాల చైర్మన్ కె.డోమినిక్, డిబిఆర్‌సి సిటీ కో–ఆర్డినేటర్ బలే సురేష్, మహిళా నాయకురాలు ఆర్‌పీ రమాదేవి, మౌనిక పాల్గొన్నారు. ఈ సందర్భంగా మానవ హక్కులు కాపాడాలంటూ నినాదాలు చేశారు.

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక



రెడ్డి శ్రీనివాస దాంగే



కంకిపాటి బుచ్చిబాబు

ఏలూరు (టూటౌన్): ఏలూరు స్ఫూర్తి భవన్ నందు ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ప్రథమ మహాసభలు ఆదివారం మధ్యాహ్నం ముగిసాయి. అనంతరం 29 మంది సభ్యులతో ఏలూరు జిల్లా ఏఐటీయూసీ కమిటీని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుందన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీనివాస డాంగే, కంకిపాటి బుచ్చిబాబు, గౌరవ అధ్యక్షుడిగా కె.కృష్ణమాచార్యులు, ఉపాధ్యక్షుడిగా బండి వెంకటేశ్వరరావు, జి.అంజమ్మ, బి.రాంబాబు, భజంత్రీ శ్రీనివాసరావు ఉప ప్రధాన కార్యదర్శులుగా చాట్ల పుల్లారావు, తొర్లపాటి బాబు, కోశాధికారిగా పుప్పాల కన్నబాబు, సహాయ కార్యదర్శులుగా ఏ.అప్పలరాజు, ఎ.రాజు, కె.సైదా, కె.విగ్నేష్‌ను ఎన్నుకున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసడాంగే, బుచ్చిబాబు తెలిపారు.

తెలుగు భాషను పరిరక్షించుకోవాలి

గణపవరం: మన సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించే సాహిత్యాన్ని పరిరక్షించుకోవలసిన బాధ్యత మనందరిపైన ఉందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం ఛైర్మన్, మాజీ మంత్రి ఇందుకూరి రామకృష్ణంరాజు అన్నారు. ఆదివారం గణపవరం మండలం పిప్పర శాఖా గ్రంథాలయానికి ఆయన తెలుగు, ఆంగ్లభాషకు సంబంధించిన సాహిత్య పుస్తకాలను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకుని విజ్ఞాన వంతులు కావాలని కోరారు. గ్రంథాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రిస్మస్ ఆరాధన పండుగలు



క్రిస్మస్ ఆరాధన పండుగల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మన్నా చర్చి ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈ నెల 11వ తేదీ నుంచి నగరానికి చెందిన మన్నా చర్చ్ ఆధ్వర్యంలో క్రిస్టమస్ ఆరాధన పండుగలు నిర్వహించనున్నట్లు మన్నా చర్చ్ పాస్టర్ ఎం. జ్యోతిరాజు తెలిపారు. ఆదివారం స్థానిక ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ ఈ ఆరాధన పండుగలు ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల నుంచి స్థానిక ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో నిర్వహిస్తామన్నారు. బిషప్ ఎం.ఎలీషా రాజు అధ్యక్షతన నిర్వహించనున్న ఈ ఆరాధన పండుగల్లో ప్రముఖ వర్తమానికులు హైదరాబాద్‌కు చెందిన రాజ్ ప్రాష్ పాల్ ప్రధాన వక్తగా వాక్య సందేశమిస్తారని తెలిపారు. ఈ ఆరాధన పండుగల్లో సిస్టర్ జెస్సీ పాల్, ఎం. జ్యోతి రాజు, సునీత జ్యోతిరాజు వాక్యపరిచర్య చేస్తారన్నారు. ఈ పండుగల్లో ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని, నగర మేయర్ నూర్జహాన్ పెదబాబు, ఏపీ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ బొల్లవరపు జాన్ వెస్లీ, వైఎస్ఆర్ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేడిది జాన్సన్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని వివరించారు. ఈ పండుగల్లో భాగంగా మన్నా చర్చి ఆధ్వర్యంలో 200 మంది క్వాయర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారని, సంగీత దర్శకులు జేకే క్రిస్టఫర్, బ్రదర్‌బాబీ సంగీత దర్శకత్వంలో ప్రముఖ గాయనీ గాయకులు మధురమైన సంగీత గానాలు చేస్తారన్నారు. దీనితో పాటు మన్నా చర్చి సండే స్కూల్, యూత్ ఆధ్వర్యంలో నాటికలు ప్రదర్శిస్తారని, క్యాండిల్ లైట్ సర్వీస్ జరుగుతుందని తెలిపారు. ఈ ఆరాధన పండుగల్లో నగరంతో పాటు పరిసర ప్రాంతాల క్రైస్తవ సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రభువు కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ సందర్భంగా క్రిస్మస్ ఆరాధన పండుగల పోస్టర్లను ఆవిష్కరించారు.

433 మందికి ఉచిత వైద్య పరీక్షలు



వైద్యశిబిరంలో పాల్గొన్న రోగులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక శ్రీ గాంధీ ఆంధ్ర జాతీయ మహావిద్యాలయంలో ఆదివారం జీబీఆర్ ఫౌండేషన్, శ్రీ దుర్గా తేజ లయన్స్ క్లబ్, జన విజ్ఞాన వేదిక, రెడ్ క్రాస్, మానవత స్వచ్ఛంద సంస్థల కార్యకర్తల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మూర్ఛ, పక్షవాతం, సుగరు, బీపీ వ్యాధులకు సంబంధించి 433 మందికి పైగా రోగులకు వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ప్రముఖ వైద్యులు గోపాళం శివన్నారాయణ, డాక్టర్ కోమలి, ఇతర వైద్య బృందంతో పాటు 22 మంది వలంటీర్లు పాల్గొని తమ సేవలందించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివన్నారాయణ మాట్లాడుతూ రోగులు సరైన సమయానికి తమ వ్యాధిపై శ్రద్ధ తీసుకోవాలని, సరైన సమయంలో మందులు వాడాలని సూచించారు. ఇటువంటి వైద్య శిబిరం వచ్చే ఏడాది ఏప్రిల్ 14న ఇదే ప్రాంగణంలో నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ కోడూరి, వీవీ స్వామి, సాయిరాజు భల్లం, కోదాటి శ్రీను, జీవీఎల్, కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

పంట నష్టం అంచనా వేసి రైతులను ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): పంట నష్టం అంచనా వేసి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి జిల్లా కలెక్టర్‌కు ఆదివారం ఆన్‌లైన్ ద్వారా వినతిపత్రాన్ని అందించారు. నష్టం అంచనాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేయాలని కోరారు. ఏలూరు జిల్లాలో 41,473 ఎకరాల్లో వరి, 8,486 ఎకరాల్లో మొక్కజొన్న, 4,101 ఎకరాల్లో మినుము, 5,886 ఎకరాల్లో పెసలు, 930 ఎకరాల్లో వేరుశనగ, 4,352 ఎకరాల్లో పొగాకు, 2,827 ఎకరాల్లో ప్రత్తి కలిపి మొత్తంగా 68,052 ఎకరాలు పంట దెబ్బతిన్నట్లు అధికారులు తేల్చారన్నారు. దెబ్బతిన్న ఆహార పంటలకు రూ.25వేలు, వాణిజ్య పంటలకు రూ.50 వేలు చొప్పున పరిహారం ఇవ్వాలని కోరారు. అసంఘటిత రంగ కార్మికులకు, చేతివృత్తిదారులకు రూ.5వేలు చొప్పున పరిహారం ఇవ్వాలన్నారు.